

ప్రభుత్వ కార్యక్రమమా? వైసీపీ బహిరంగ సభా?

నిబంధనలను తుంగలో తొక్కుతున్న అధికారులు

- నేడు జిల్లాకు సీఎం జగన్మోహన్‌రెడ్డి రాక
- పిసినికాడలో బటన్ నొక్కి 'చేయూత' నిధులు విడుదల
- సభా ప్రాంగణం మొత్తం వైసీపీ జెండా రంగుల పరదాలు, టెంట్‌లు
- వారం రోజుల నుంచి జనసమీకరణలో అధికార యంత్రాంగం
- జనాన్ని తరలించేందుకు 250 ఆర్టీసీ బస్సులు కేటాయింపు



వైసీపీ సభను తలపిస్తున్న సభా ప్రాంగణం పైకప్పు (గుడారం)

అనకాపల్లి/కశింకోట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):



జిల్లాలో ప్రభుత్వ కార్యక్రమాల ఏర్పాట్లను వైసీపీ సమావేశాల తరహాలో అధికారులు చేస్తుండడం రాజకీయ వర్గాలను విస్మయానికి గురిచేస్తున్నది. ముఖ్యమంత్రి, మంత్రులు అధికారికంగా పాల్గొనే సభలు, సమావేశాలు, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో వైసీపీ జెండా రంగులతో పందిళ్లు, ఫ్లెక్సీలు, చివరకు బెలూన్లు కూడా ఏర్పాటు చేసున్నారు. వీటిపై పార్టీ చిహ్నం, ఎన్నికల గుర్తు మాత్రమే వుండడంలేదు. మిగిలినదంతా సేమ్ టు సేమ్.

'చేయూత' పథకం నాలుగో విడత నిధులు విడుదలకు సంబంధించి అనకాపల్లి మండలం పిసినికాడలో గురువారం బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సీఎం జగన్మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, బటన్ నొక్కి నిధులు విడదల చేయనున్నారు. ఈ కార్యక్రమం కోసం అధికారులు వారం రోజుల నుంచి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇంతవరకు బాగానే వున్నప్పటికీ సభ ఏర్పాట్లలో అధికారులు వ్యవహరిస్తున్న తీరు విస్మయానికి గురిచేస్తున్నది. సీఎం సభ నిర్వహణ ఏర్పాట్లకు ప్రజా ధనం ఖర్చు చేస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా ఏర్పాట్లు చేయాలి. కానీ యావత్ సభా ప్రాంగణాన్ని వైసీపీ సభగా మార్చేశారు. చుట్టూ పరదాలు, పందిళ్ల పైకప్పు, ప్రధాన వేదిక, చివరకు నేలపై పరిచే తివాచీలతో సహా అన్నీ వైసీపీ జెండా రంగులతో నింపేస్తున్నారు. ఇక్కడి ఏర్పాట్లను చూసే వారికి ఇది వైసీపీ బహిరంగ సభ ... మిగతా 8వ పేజీలో

సీఎం పర్యటనతో హైవే బంద్

- భారీ వాహనాలు లంకెలపాలెం నుంచి పరవాడ, అచ్యుతాపురం, ఎలమంచిలి మీదుగా మళ్లింపు
- ఎస్పీ కేవీ మురళీకృష్ణ వెల్లడి -7లో

బీసీలకు భరోసా!

టీడీపీ-జనసేన బీసీ డిక్లరేషన్‌పై హర్షాతిరేకాలు

- వెనుకబడిన తరగతుల ఆర్థికాభివృద్ధికి ఎంతో దోహదం
- 50 ఏళ్లకే పింఛన్‌పై బీసీల్లో ఆనందం
- విద్యాభివృద్ధి, స్వయం ఉపాధికి పెద్ద పీట
- చంద్రన్న బీమా పథకం రూ.10 లక్షలతో పునరుద్ధరణ
- చట్టబద్ధంగా బీసీల కుల గణన
- రూ.5 వేల కోట్లతో 'ఆదరణ'
- బీసీల ఆర్థిక, సామాజిక, రాజకీయ ఎదుగుదలకు డిక్లరేషన్ దోహదం



బీసీ డిక్లరేషన్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్, ఇరు పార్టీల నేతలు (ఫైల్ ఫొటో)

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

వెనుకబడిన తరగతుల సమగ్ర అభివృద్ధి, సామాజిక న్యాయం లక్ష్యంగా తెలుగుదేశం-జనసేన పార్టీలు ఉమ్మడిగా ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌పై జిల్లాలో ఆయా వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మంగళగిరి సమీపంలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా వున్న మైదానంలో మంగళవారం 'జయహో బీసీ' నినాదంతో ఉమ్మడిగా నిర్వహించిన సభలో పలు అంశాలపై రూపొందించిన బీసీ డిక్లరేషన్‌ను చంద్రబాబునాయుడు, పవన్‌కకల్యాణ్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ప్రధానంగా 50 ఏళ్లకే పింఛన్, రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంపు బీసీలకు ఎంతో ఊరటనిస్తుంది. ఇక ఐదేళ్లలో రూ.1.5 లక్షల కోట్ల సబ్‌ప్లాన్ నిధులు, స్వయం ఉపాధికి ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు ఖర్చు, రూ.5 వేల కోట్లతో ఆదరణ పరికరాలు పంపిణీ బీసీల ఆర్థికాభివృద్ధికి దోహపడతాయని అంటున్నారు. రూ.10 లక్షలతో చంద్రన్న బీమా పథకం పునరుద్ధరణ, పెళ్లి కానుక రూ.లక్షకు పెంపు వంటివి ఆర్థికంగా ఆదుకుంటాయని అభిప్రాయపడుతున్నారు. ఇక విద్యార్థులకు సంబంధించి శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు, బీసీ గురుకుల పాఠశాలలన్నీ జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్, విదేశీ విద్యకు ఆర్థిక సాయం, పీజీ విద్యార్థులకు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్టడీసర్కిల్, విద్యోన్నతి వంటి పథకాలు ఉపయుక్తంగా వున్నాయని చెబుతున్నారు. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్‌ను వైసీపీ ప్రభుత్వం 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించిందని, బీసీల రిజర్వేషన్‌లను యథావిధిగా (34 శాతం) కొనసాగించడమే కాకుండా చట్టసభల్లో కూడా బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కోసం తీర్మానం చేసి కేంద్రానికి పంపి బీసీల రాజకీయంగా ఎదుగుదలకు తోడ్పాటునందిస్తామని ప్రకటించారు.

బీసీల కోసం ప్రత్యేక రక్షణ చట్టం తెచ్చి, బీసీలపై దాడులు, దౌర్జన్యాల నుంచి రక్షణ కల్పిస్తామని, సామాజిక న్యాయ పరిశీలన కమిటీలను ఏర్పాటు చేసి హక్కులను కాపాడతామని డిక్లరేషన్‌లో పేర్కొన్నారు. జనబాపరంగా కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి, దామాషా ప్రకారం నిధులు కేటాయిస్తామని ప్రకటించారు.

బీసీ కులాల్లో వృత్తిదారుల కోసం టీడీపీ హయాంలో అమలు చేసిన ఆదరణ పథకాన్ని రూ.5 వేల కోట్లతో పునరుద్ధరిస్తామని వెల్లడించడంతో వృత్తిదారుల్లో ఆనందం వ్యక్తమవుతున్నది. టీడీపీ-జనసేన అధికారంలోకి వచ్చాక బీసీల కుల గణన చట్టబద్ధంగా చేస్తామని ప్రకటించారు. సామాజిక అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా బీసీ భవనాలు, సామాజిక భవనాల నిర్మాణాలు ఏడాదిలో పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. టీడీపీ, జనసేన కూటమి అధినేతలు ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌తో బీసీలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందుతారని బీసీ సంఘాల నేతలు అభిప్రాయపడుతున్నారు.

మరింత మంది అభిప్రాయాలు - 7లో

బీసీ విద్యార్థులకు చాలా ఉపయోగం



తెలుగుదేశం- జనసేన పార్టీలు ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో పొందుపరిచిన పలు పథకాలు బీసీ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయి. శాశ్వత కుల ధ్రువీకరణ పత్రం మంజూరు వల్ల సమయం, డబ్బు ఆదా అవుతాయి. ప్రస్తుతం ఫీజు రీయింబర్స్‌మెంట్ డిగ్రీ వరకే అమలవుతున్నది. దీంతో చాలా మంది బీసీ విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లలేకపోతున్నారు. పీజీ విద్యార్థులకు కూడా ఫీజు రియింబర్స్‌మెంట్ అమలు చేస్తామని టీడీపీ-జనసేన ప్రకటించడం ఎంతో సంతోషం. దీంతోపాటు విదేశీ విద్యకు ఆర్థిక సాయం ప్రకటించడం హర్షణీయం.

- జి.మోహనలక్ష్మి, బీఎస్సీ విద్యార్థిని, నర్సీపట్నం

బీసీల రక్షణకు చట్టం అవశ్యం



టీడీపీ, జనసేన బీసీ డిక్లరేషన్‌లో బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామని ప్రకటించడం మంచి పరిణామం. బీసీలపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడే వారిపై అట్రాసిటీ కేసులు పెట్టేవిధంగా చట్టాన్ని రూపొందిస్తే మరింత రక్షణ కలుగుతుంది. టీడీపీ-జనసేన ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను సంపూర్ణంగా అమలు చేస్తే వెనుకబడిన వర్గాలకు పలు విధాలుగా మేలు జరుగుతుంది.

- కోరుకొండ సాంబశివరావు, ఉమ్మడి విశాఖ జిల్లా తూర్పుకాపు సంఘం అధ్యక్షుడు, అనకాపల్లి

50 ఏళ్లకే పింఛన్‌తో కూలీలకు ఎంతో మేలు



నా వయసు 55 సంవత్సరాలు. కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. 60 ఏళ్ల నిండితేనే వైసీపీ ప్రభుత్వ పింఛన్ ఇస్తున్నది. టీడీపీ-జనసేన అధికారం లోకి వస్తే 50 ఏళ్లకే పింఛన్ మంజూరు చేసి, రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచుతామని ప్రకటించారు. దీనివల్ల నాలాంటి వారికి ఎంతో మేలు చేకూరుతుంది. బీసీ డిక్లరేషన్‌లో పేర్కొన్న సబ్‌ప్లాన్‌కు రూ.లక్షన్నర కోట్లు, చంద్రన్న బీమా రూ.10 లక్షలకు పెంపు, పెళ్లికానుక రూ.లక్షకు పెంపు వంటివి చాలా మందికి లబ్ధి చేకూరుస్తాయి.

- తమరాన సోమినాయుడు, ఎల్‌బీపీ అగ్రహారం, బుచ్చెయ్యపేట మండలం

పడకేసిన మెగా నీటి పథకం

బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులు ఆపేసిన కాంట్రాక్టు కంపెనీలు

- ఏడాది నుంచి అడుగు కూడా ముందుకు కదలని వైనం
- నర్సీపట్నం సమగ్ర తాగునీటి పథకానికి 2022 సెప్టెంబరులో ఎమ్మెల్యే శంకుస్థాపన
- ఏఐఐబీ నుంచి రూ.166.89 కోట్ల రుణం
- 24 నెలల్లో ప్రాజెక్టు పూర్తిచేయాలని లక్ష్యం
- రెండు ప్యాకేజీలుగా విభజన
- ఏడాది క్రితంనాటికి రూ.22 కోట్ల విలువైన పనులు పూర్తి
- ఒక్కరూపాయి కూడా విడుదల కాకపోవడంతో పనులు ఆపేసిన కాంట్రాక్టర్లు



బలిఘట్టంలో పునాదులకే పరిమితమైన ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణ పనులు

నర్సీపట్నం, మార్చి 6 :

"నర్సీపట్నం మునిసిపాలిటీలో ఇంటింటికి రక్షిత తాగునీరు అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూ.166.89 కోట్లుతో భారీ తాగునీటి పథకం మంజూరు చేశారు. రెండేళ్లలో పథకం పనులు పూర్తవుతాయి. పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య శాశ్వతంగా తొలగుతుంది" అని 2022 సెప్టెంబరు ఒకటో తేదీన నర్సీపట్నం పెద్ద చెరువు వద్ద సమగ్ర మంచినీటి పథకానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ చెప్పారు. ఇది జరిగి సుమారు ఏడాదిన్నర అవుతున్నది. ఎమ్మెల్యే చెప్పిన ప్రకారం ఈ ప్రాజెక్టుకు సంబంధించి సుమారు 75 శాతం పనులు పూర్తయి వుండాలి. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా వుంది. సుమారు ఏడాది క్రితం రూ.22 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. కాంట్రాక్టు సంస్థలకు ఒక్కదఫా కూడా బిల్లు మంజూరు కాలేదు. దీంతో పనులు ఆగిపోయాయి.

నర్సీపట్నం మునిసిపాలిటీ ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించడానికి వైసీపీ ప్రభుత్వం మూడేళ్ల క్రితం సమగ్ర రక్షిత తాగునీటి పథకానికి రూపకల్పనచేసింది. ఇందుకు అవసరమయ్యే నిధులను ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ) నుంచి రూ.166.89 కోట్లు రుణంగా తీసుకున్నది. రక్షిత తాగునీటి పథకం పనులకు పెద్ద చెరువు వద్ద 2022 సెప్టెంబరు ఒకటో తేదీన ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ శ్రీకారం చుట్టారు. 24 నెలల్లో ప్రాజెక్టు పూర్తికావాలన్నది లక్ష్యం. ప్యాకేజీ-1 కింద పంప్ హౌస్, రిజర్వాయర్లు, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టాలి. ప్యాకేజీ-2 కింద పైప్‌లైన్లు, ఇంటింటికి కొళాయిలు ఏర్పాటు చేయాలి. ప్యాకేజీ-1 పనులను నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ, ప్యాకేజ్-2 పనులను వెల్‌కో కంపెనీ చేపట్టాయి. ప్యాకేజీ-1లో కోటవురట్ల మండలం ఎండపల్లిలో ఏలేరు కాలువ వద్ద 650 కిలోలీటర్లు సామర్థ్యంగల సంపు, పంప్ హౌస్, జోగినాథునిపాలెంలో 650 కిలోలీటర్ల సామర్థ్యంగల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించాలి. నర్సీపట్నం పెద్ద చెరువును సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుగా అభివృద్ధి చేసి, 13.6 ఎంఎల్‌టీ సామర్థ్యంగల ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మించాలి. నర్సీపట్నం సీబీఎం కాంపౌండ్‌లో 1,000 కిలోలీటర్లు, తహసీల్దార్ కార్యాలయం వద్ద 900 కిలోలీటర్లు, బలిఘట్టంలో 800 కిలోలీటర్లు, పెదబొడ్డేపల్లి మునిసిపల్ కార్యాలయం వద్ద 700 కిలోలీటర్ల సామర్థంగల రిజర్వాయర్లు/ ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మాణం చేయాలి. ప్యాకేజీ-2లో రిజర్వాయర్ల నుంచి నీటి సరఫరా పైప్‌లైన్లు, ఇంటింటికి కొళాయిలు వేయాలి.

కాగా ప్యాకేజీ-1లో సీబీఎం కాంపౌండ్ ఆవరణలో రిజర్వాయర్ పనులకు పునాదులు తవ్వి ఆపేశారు. బలిఘట్టంలో పునాదుల స్థాయిలో పనులు నిలిచి పోయాయి. మిగిలిన వాటిలో ఒక్క పని కూడా మొదలు పెట్టలేదు. ప్యాకేజీ-2లో పైప్ లైన్ ... మిగతా 8వ పేజీలో



బలిఘట్టంలో వృథాగా పడివున్న నీటి సరఫరా పైపులు

ఫిషింగ్ హార్బర్ హుష్ కాకి!

- పూడిమడకలో జెట్టీ నిర్మాణంపై కోటలు దాటుతున్న వైసీపీ పాలకుల మాటలు
- అధికారంలోకి వచ్చి ఐదేళ్లు కావస్తున్నా శంకుస్థాపన చేయని వైనం!

అచ్యుతాపురం, మార్చి 6:

'అర చేతిలో వైకుంఠం చూపడం' సీఎం నుంచి కిందిస్థాయిలో అధికార పార్టీ ప్రజాప్రతినిధుల వరకు వెన్నతోపెట్టిన విద్య. 'అలు లేదు.. చూలు లేదు కొడుకు పేరు...' అన్న సామెత కూడా వైసీపీ పాలకులకు బాగా అతికినట్టు సరిపోతుంది. అధికార పార్టీ నాయకులు చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులకు అసలు పొంతన ఉండదు. అచ్యుతాపురం మండలం పూడిమడక వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మాణంపై వీరు చేస్తున్న ప్రకటనలే ఇందుకు ఒక ఉదాహరణ.



పూడిమడక సమీపంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి ఎంపిక చేసిన ఉప్పుటేరు మొగ

ఉమ్మడి విశాఖ జిల్లాలో అతి పెద్ద మత్స్యకార గ్రామమైన పూడిమడక నుంచి ఏటా భారీ స్థాయిలో చేపల ఎగుమతులు జరుగుతుంటాయి. కానీ ఇక్కడ పడవలు నిలుపుకోవడానికి సరైన సదుపాయం లేకపోవడంతో మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య గత తెలుగుదేశం ప్రభుత్వ దృష్టికి వచ్చింది. అప్పటి సీఎం చంద్రబాబు 2016 జూలైలో అచ్యుతాపురం సెజ్‌కు వచ్చిన సందర్భంగా పూడిమడకను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడంతోపాటు ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తామని ప్రకటించారు. దీనికి సంబంధించి నివేదిక అందజేసే బాధ్యతను వాటర్ అండ్ పవర్ కన్సల్టెన్సీ (వాప్‌కాస్) సంస్థకు అప్పగించారు. ఈ సంస్థ పలుమార్లు సర్వేలు నిర్వహించి ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి ఈ ప్రదేశం అనుకూలమేనని నివేదిక ఇచ్చింది. ఇంకా కొన్ని సూచనలు కూడా చేసింది. చేపల వేట అనంతరం మత్స్యకారులు తమ పడవలను నిలుపుకునేందుకు ఉప్పుటేరును లోతు చేయాలని, పల్లిపేట శివారులోని రుద్రభూమి నుంచి పొగిరి వరకు మూడు కిలో మీటర్ల మేర రోడ్డు వేయాలని సూచించింది. ఇక ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి 35 హెక్టార్లు అవసరమని నిర్ణయించారు. సముద్ర తీరంలో పూడిమడక పంచాయతీ సర్వే నంబర్ 139లో 216 ఎకరాల ప్రభుత్వ భూమి వుందని, దీనిలో 35 హెక్టార్లను ఫిషింగ్ హార్బర్‌కు కేటాయిస్తామని అప్పటి తహసీల్దార్ ప్రకటించారు. ఈ మొత్తం పనులకు రూ.350 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. తదుపరి సర్వేలు జరుగుతుండగా ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం అటకెక్కింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పూడిమడకలో హార్బర్ నిర్మిస్తామని పాలకులు ప్రకటన చేశారు. ఇది జరిగి ఐదేళ్లు కావస్తున్నప్పటికీ పనులు మాత్రం మొదలుకాలేదు.

ఇదిలావుండగా పూడిమడక వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి విశ్వ సముద్ర కన్‌స్ట్రక్షన్ కంపెనీకి టెండర్ అప్పగించినట్టు తెలిసింది. హార్బర్ నిర్మాణానికి రూ.380 కోట్లు అవసరమని అంచనా వేయగా, ఇందులో కేంద్ర ప్రభుత్వం తన వాటాగా రూ.80 కోట్లు ఇస్తుంది. మిగతాది రాష్ట్ర ప్రభుత్వం భరించాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేవు. కేంద్రం మంజూరు చేసిన నిధులు వెనక్కు మళ్లకుండా ... మిగతా 8వ పేజీలో



2022 అక్టోబరు 8వ తేదీన పూడిమడకలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న నాటి మత్స్యశాఖ జేడీ బాలాజీ

అనకాపల్లి ఆర్డీఓపై కేసు నమోదు

- కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు చర్యలు

అనకాపల్లి టౌన్, మార్చి 6: భూపత్రాల విషయంలో అనకాపల్లి ఆర్డీఓ చిన్నికృష్ణపై పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. గవరపాలేనికి చెందిన విల్లూరి జగన్నాథ్ తన తల్లికి చెందిన ఆర్‌సీ నంబర్ 294/89 ఆర్‌ఓఆర్ నంబరుతో వున్న పత్రాలతో 18వ తేదీ 2021 ఆగస్టు 18వ తేదీన అనకాపల్లి తహసీల్దారు కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తరువాత ఈ ఫిర్యాదు పత్రాలు కార్యాలయంలో కనిపించకుండా పోయాయి. దీనిపై జగన్నాథ్.. కొంతకాలం తరువాత ఆర్డీఓ చిన్నికృష్ణ వద్దకు వెళ్లి అడగ్గా.. అప్పిలేట్ అథారిటీ విచారణ చేసి నెల రోజుల్లో ఇస్తామని చెప్పారు. గడువు దాటినప్పటికీ తహసీల్దారు, ఆర్డీఓల నుంచి స్పందించలేదు. 2022 సెప్టెంబరు 29న కలెక్టర్ ఆదేశాల మేరకు సర్టిఫైడ్ కాపీలు ఇవ్వాలని సూచించగా సంబంధిత ఫైలు కనిపించడం లేదని వివరణ ఇచ్చారు. ఫైలు ఎలా కనిపించకుండా పోయిందో తనకు సమాధానం చెప్పాలని జగన్నాథ్ కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు ఉత్తర్వుల మేరకు ఆర్డీఓపై ఈ ఏడాది ఫిబ్రవరి 1వ తేదీన పట్టణ సీఐ శంకరరావు కేసు నమోదు చేశారు.

రూ.54.4 కోట్లతో సింహగిరి అభివృద్ధి

- 'ప్రసాద్' పథకం కింద నిధులు మంజూరు
- నేడు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న ప్రధాని మోదీ

సింహాచలం, మార్చి 6: కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి 'ప్రసాద్ (పిల్‌గ్రిమేజ్ రిజువినేషన్ అండ్ స్పిరిట్యువల్ ఆగ్మెంటేషన్ డ్రైవ్) అనే పథకానికి రూపకల్పన చేసింది. అందులో భాగంగానే సింహాచలం వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం పరిధిలో రూ.54.4 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో 2022 సెప్టెంబరులో డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) సమర్పించగా ఆమోదం తెలిపింది. నాటి నుంచి అనేక చర్చోపచర్చల తరువాత ఎట్టకేలకు గురువారం మధ్యాహ్నం 11.45 గంటలకు శ్రీనగర్ నుంచి ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో దేశవ్యాప్తంగా 'ప్రసాద్' పనులకు లాంఛనంగా శంకుస్థాపన చేయనున్నారు.

బీసీలకు టీడీపీ-జనసేన పెద్ద పీట

పది అంశాల డిక్లరేషన్‌పై సర్వత్రా హర్షం

పబ్లిక్ పల్స్



తెలుగుదేశం- జనసేన పార్టీలు మంగళవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా వున్న మైదానంలో నిర్వహించిన 'జయహో బీసీ' బహిరంగ సభలో ప్రకటించిన 'బీసీ డిక్లరేషన్'పై వెనుకబడిన వర్గాల వారు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. బీసీ డిక్లరేషన్‌లో పేర్కొన్న హామీలను అమలు చేస్తే ప్రతి ఒక్క కుటుంబానికి కనీసం ఒక్క ప్రయోజనం అయినా చేకూరుతుందని వివిధ కులాలు, విభిన్న వృత్తులకు చెందిన ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా 50 ఏళ్లకే పెన్షన్, సబ్‌ప్లాన్‌కు రూ.లక్షన్నర కోట్లు, ఆదరణ, చంద్రన్న బీమా, విదేశీ విద్యకు ఆర్థిక సాయం, పీజీ విద్యార్థులకు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్, పెళ్లి కానుక రూ.లక్షకు పెంపు వంటివి ఎంతో మేలు చేస్తాయని సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం- జనసేన పార్టీలు ప్రకటించిన 'బీసీ డిక్లరేషన్'పై ఎవరేమన్నారంటే...

బీసీల్లో అన్ని వర్గాలకు ప్రయోజనం



తెలుగుదేశం - జనసేన పార్టీలు 'జయహో బీసీ' బహిరంగ సభలో ప్రకటించిన 'బీసీ డిక్లరేషన్' ద్వారా అన్ని వర్గాల వారికి ప్రయోజనం కలుగుతుంది. 50 ఏళ్లకే పెన్షన్ మంజూరు చేయడంతో పాటు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంపు వల్ల ఆర్థిక ఆసరా లభిస్తుంది. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ అమలుతో బీసీలకు సముచిత ప్రాధాన్యం కల్పించినట్టు అవుతుంది. రూ.లక్షన్నర కోట్లతో బీసీలకు సబ్ ప్లాన్ అమలు చేస్తామని ప్రకటించడం మంచి నిర్ణయం. చంద్రన్న బీమా ప్రయోజనాన్ని రూ.10 లక్షలకు పెంచడం, చంద్రన్న పెళ్లి కానుక రూ. లక్షకు పెంచడం హర్షణీయం. మొత్తం మీద బీసీ డిక్లరేషన్‌లో పేర్కొన్న అంశాలు అమలైతే బీసీలు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు.

- ద్రాక్షారపు కామేశ్వరరావు, బలిఘట్టం, నర్సీపట్నం

చంద్రన్న బీమా బీసీలకు వరం



తెలుగుదేశం- జనసేన పార్టీలు ఉమ్మడిగా ప్రకటించిన బీసీ డిక్లరేషన్ చాలా బాగుంది. ముఖ్యంగా రూ.పది లక్షలతో చంద్రన్న బీమా పథకం పునరుద్ధరణ.. పెద్ద దిక్కును కోల్పోయిన బీసీ కుటుంబాలకు వరంలాంటిది. .

- ఈర్లె శ్రీనివాసరావు, పాల సంఘం అధ్యక్షుడు, ఎడ్ల వీధి, చోడవరం

శాశ్వత కుల ధ్రువ పత్రాలతో ఎంతో ఉపయోగం



టీడీపీ- జనసేన ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు ఇస్తామనడం వల్ల ఎంతో ఉపయోగం ఉంది. విద్యార్థులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని ఉండదు. పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశీ విద్య వంటి అంశాలు ఇందులో పొందుపరచడం శుభపరిణామం. టీడీపీ- జనసేన అధికారంలోకి వస్తే అన్ని వర్గాలకు మేలు జరుగుతుంది.

- ధర్మిరెడ్డి సత్యనారాయణ,
రామన్నపాలెం, అచ్యుతాపురం మండలం

పెళ్లికానుకతో ఆర్థిక ఆసరా



తెలుగుదేశం- జనసేన కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలకు పెళ్లికానుకను రూ.లక్షకు పెంచుతామని ప్రకటించడం చాలా ఆనందంగా ఉంది. సామాన్య కుటుంబాలకు నిజమైన కానుకగానే భావించాలి. ఆర్థిక స్తోమత లేని కుటుంబాలకు పెళ్లి కానుక రూపంలో ఇచ్చే లక్ష రూపాయలు ఎంతో ఆదుకుంటాయి.

- బయలపూడి పైడిరత్నం, పిల్లావారితోట, చోడవరం

బీసీల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి దోహదం



తెలుగుదేశం పార్టీ, జనసేన కూటమి ప్రకటించిన బీసీ డిక్లరేషన్ బీసీలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించేందుకు దోహదం చేస్తుంది. బీసీలకు 50 ఏళ్లకే నాలుగు వేల రూపాయల పెన్షన్ ఇవ్వడం వల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడే ఎంతోమందికి ఆసరా లభిస్తుంది. బీసీ రక్షణకు ప్రత్యేక చట్టాన్ని చేయాలనుకోవడం గొప్ప విషయం. సబ్ ప్లాన్‌కు లక్షన్నర కోట్ల రూపాయలు కేటాయింపు అంటే గతంలో ఎన్నడూ లేని విధంగా బీసీల సమగ్ర ఆర్థిక అభివృద్ధికి బాటలు పడే అవకాశముంటుంది. ప్రోత్సాహకాల పునరుద్ధరణ వల్ల స్వయం ఉపాధి మార్గాల బాట పట్టేందుకు బీసీ యువతకు అవకాశం ఏర్పడుతుంది.

- వి.సంగంనాయుడు, విశాఖపట్నం

బీసీలను ఆర్థికంగా ఆదుకున్నట్టే..



బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని టీడీపీ- జనసేన బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించడం వల్ల బీసీలను ఆర్థికంగా ఆదుకున్నట్టు అవుతుంది. పేదలకు రూ.4 వేల పింఛన్ వస్తే వారికి ఎంతో భరోసా ఉంటుంది. ఇది బీసీలకు ఎంతో ఊరటనిస్తుంది.

- బొద్దపు నాయుడు,
పెదపల్లి, ఎలమంచిలి మునిసిపాలిటీ

బీసీలకు భరోసా



తెలుగుదేశం- జనసేన పార్టీలు ప్రకటించిన బీసీ డిక్లరేషన్ అమలైతే అన్ని వర్గాల వారికి ప్రయోజనం చేకూరుతుంది. చేతివృత్తులపై ఆధారపడిన వారికి 'ఆదరణ' పథకం ఎంతో దోహదపడుతుంది. బీసీల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకువస్తామని ప్రకటించడం ఆనందంగా ఉంది. బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ మంజూరు, పెన్షన్‌ను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంపు వంటివి ఆర్థిక భరోసా కల్పిస్తాయి.

మునాసుల నాగేశ్వరరావు, పొంగలిపాక, మాడుగుల మండలం

విద్యకు పెద్దపీట వేయడం శుభపరిణామం



టీడీపీ- జనసేన ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో విద్యకు పెద్దపీట వేశారు. షరతులు లేకుండా విదేశీ విద్య పథకం అమలు చేస్తామని ప్రకటించడం నాలాంటి విద్యార్థినులకు ఎంతో మేలు. పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పునరుద్ధరిస్తామని, విద్యోన్నత పథకాలు పునఃప్రారంభిస్తామని ప్రకటించడం శుభపరిణామం.

- మేడిశెట్టి అశ్లేష, విద్యార్థిని, బొద్దపువానిపాలెం,
పరవాడ మండలం

మాకు మేలు జరుగుతుందనే నమ్మకం ఉంది



నాకు 55 ఏళ్లు. కాళ్లు, చేతులు సరిగా పనిచేయక పనిలోకి వెళ్లలేకపోతున్నాను. కూలి పనులు చేయలేకపోతున్నాను. టీడీపీ- జనసేన అధికారంలోకి వస్తే బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని ప్రకటించడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. కచ్చితంగా మాకు మేలు జరుగుతుందనే నమ్మకం కలిగింది.

- ఇసరపు రాజులు,
నామవరం, పాయకరావుపేట మండలం

బీసీల ఉన్నతికి దోహదం



టీడీపీ- జనసేన కూటమి ప్రకటించిన బీసీ డిక్లరేషన్ బీసీల అభ్యున్నతికి ఎంతో మేలు కలిగించేలా ఉంది. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టంతో పాటు సబ్ ప్లాన్‌కు ఐదేళ్లలో రూ.లక్షన్నర కోట్లు కేటాయిస్తామని ప్రకటించడం శుభసూచికం. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పడం, చంద్రన్న బీమా రూ.10 లక్షలతో పునరుద్ధరిస్తామని వెల్లడించడం శుభపరిణామం.

- కరణం అప్పారావు, దేశపాత్రునిపాలెం, పరవాడ మండలం

50 ఏళ్లకే పింఛన్‌తో ఎంతో మేలు



టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సంయుక్తంగా ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని వెల్లడిం చడం వల్ల ఎంతో మేలు జరుగుతుంది. బీసీల్లో చాలా మంది ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతో నెలంతా కష్టపడినా వచ్చే ఆదాయం సరిపోక అర్ధాకలితో అలమటిస్తున్నారు. పింఛన్‌పై ప్రకటన చేసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు బీసీ సంఘాల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నాం. **- కె.జేజిబాబు**, కోటవీధి, అనకాపల్లి

బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం ఎంతో అవసరం



బీసీ డిక్లరేషన్‌లో చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్‌లు బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకువస్తామని చేసిన ప్రకటన ఆహ్వానించదగ్గ పరిణామం. చంద్రన్న ఆరోగ్య బీమా, బీసీలకు చట్టబద్ధమైన కులగణన, ఉపాధి ప్రోత్సాహం, బీసీల వివాహాలకు రూ.లక్ష కానుక వంటి అంశాలు బీసీలకు ఎంతో మేలు చేస్తాయి. టీడీపీ- జనసేన ప్రభుత్వం వస్తే బీసీలకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉంది.

- ఏవీ నూకేశ్వరరావు, షుగర్స్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, అనకాపల్లి

శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు హర్షణీయం



తెలుగుదేశం- జనసేన అధికారంలోకి వస్తే శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు ఇస్తామని ప్రకటించడం హర్షణీయం. ఏటేటా ధ్రువీకరణ పత్రాల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే ఇబ్బంది తొలగిపోతుంది. అలాగే పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించడం వల్ల బడుగు, బలహీనవర్గాల వారికి ఉన్నత చదువులకు అవకాశం ఉంటుంది. విదేశీ విద్యకు కూడా సహకారం అందించే విధంగా డిక్లరేషన్‌లో పొందుపరచడం విద్యార్థులకు శుభపరిణామం. **- ఎ.లలిత**, డిగ్రీ విద్యార్థిని, అనకాపల్లి

పేద కుటుంబాలకు దన్ను



టీడీపీ- జనసేన సంయుక్తంగా ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో భాగంగా 50 ఏళ్లు నిండిన బీసీలందరికీ పింఛన్ ఇస్తామని ప్రకటించడం హర్షణీయం. అనేక మంది చేతివృత్తుల వారు 50 ఏళ్లలోపే అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. ఇటువంటి తరుణంలో వారికి ఈ పింఛన్ల ప్రకటన ఎంతో దన్నుగా ఉంటుంది.

- మత్తుర్తి మన్నియాచారి, నక్కపల్లి

క్రైం... crime news

రైవాడ జలాశయంలో మునిగి వ్యక్తి మృతి



దీవి సత్తిబాబు(ఫైల్)

దేవరాపల్లి, మార్చి 6: దేవరాపల్లికి చెందిన దీవి సత్తిబాబు (48) రైవాడ జలాశయంలో ప్రమాదవశాత్తూ కాలుజారిపడి నీటిలో మునిగి మృతి చెందాడు. కాలకృత్యాలు తీర్చు కోవడానికి జలాశయం వద్దకు వెళ్లినప్పుడు ఈ సంఘటన జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం జగన్ హామీలు నీటిమూటలు

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు



మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు

తుమ్మపాల, మార్చి 6 : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జిల్లాకు ఇచ్చిన హామీలన్నీ నీటిమూటలేనని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరకు రైతులకు గిట్టుబాటు ధర ఇస్తామని, మూతపడిన తుమ్మపాల ఫ్యాక్టరీని తెరిపిస్తామని నాడు హామీ ఇచ్చారని, తీరా అధికారంలోకి వచ్చిన తరువాత తాండవ, ఏటికొప్పాక ఫ్యాక్టరీలను కూడా మూసేశారన్నారు. టీడీపీ హయాంలో మంజూరు చేసిన ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలను పులివెందులకు తరలించుకుపోయారని అన్నారు. సొంత నియోజకవర్గంలో రైతుల ప్రయోజనాలను కాపాడలేని అసమర్థ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అని ధ్వజమెత్తారు. ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రిని రూ.68 కోట్లతో కేజీహెచ్ తరహాలో సదుపాయాలు కల్పిస్తామని మాయమాటలు చెప్పి మోసం చేశారన్నారు. శారదా నదిపై గ్రోయిన్ల మరమ్మతులకు రూపాయి కూడా విదిలించలేని ఘనత వైసీపీదేనన్నారు. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి ఏ ముఖం పెట్టుకుని ఇక్కడ పర్యటనకు వస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, కోట్ని రామకృష్ణ, మళ్ల గణేశ్, పూడి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ హయాంలో బీసీలకు తీవ్ర అన్యాయం'

కశింకోట, మార్చి 6: వైసీపీ హయాంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు పెదపాటి కల్యాణి ఆరోపించారు. బుధవారం కశింకోటలో విలేకరులతో మాట్లాడుతూ, తెలుగుదేశం హయాంలో స్థానిక సంస్థల పదవుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించగా, వైసీపీ ప్రభుత్వం 24 శాతానికి తగ్గించిందన్నారు. బీసీలకు పూర్వ వైభవం రావాలంటే టీడీపీ-జనసేన కూటమిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

సీనియర్ ఉమెన్ హాకీ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



హాకీ సీనియర్ ఉమెన్ జిల్లా జట్టు క్రీడాకారిణులు

ఎలమంచిలి, మార్చి 6: ఒంగోలులో ఈ నెల 8వ తేదీ నుంచి జరగనున్న అంతర్ జిల్లాల సీనియర్ ఉమెన్ హాకీ టోర్నీకి జిల్లా జట్టు ఎంపిక ప్రక్రియ పూర్తయిందని హాకీ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ కొరారు నరేశ్ తెలిపారు. ఈ పోటీలకు 16 మంది సభ్యులతో కూడిన జట్టును ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు నరసింగరావు, ఏటీఎల్ రాజు, రాంబాబు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	112.00
లైవ్ ధర	132.00
విత్ స్కిన్	234.00
స్కిన్ లెస్	244.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

టీడీపీ-జనసేన ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి

» మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

» సూపర్-6, బీసీ డిక్లరేషన్‌పై విస్తృత ప్రచారం చేయాలని కేడర్‌కే పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి అయ్యన్నపాత్రుడు

మాకవరపాలెం, మార్చి 6: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా వుందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. మండలంలోని లచ్చన్నపాలెంలో బుధవారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. తొలుత టీడీపీ శ్రేణులు, మహిళలు ఆయనకు ఘనస్వాగతం పలికి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇవే తనకు చివరి ఎన్నికలని, అందువల్ల ప్రతి ఒక్కరూ ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. టీడీపీ హయాంలో లచ్చన్నపాలెంలో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని, రూ..10 కోట్లతో సర్పా నదిలో భారీ తాగునీటి పథకం ఏర్పాటు చేసి 12 గ్రామాలకు తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సూపర్ సిక్స్ హామీలు, బీసీ డిక్లరేషన్‌లో పేర్కొన్న అంశాలను అమలు చేస్తామని చెప్పారు. టీడీపీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి వైసీపీ పాలనలో పెరిగిన ధరలు, చార్జీలు, పన్నుల పెంపు వల్ల ఎంతెంత భారం పడుతున్నదో ప్రజలకు చెప్పాలని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమిని గెలిపిస్తే ఏయే ప్రయోజనాలు కలుగుతాయో వివరించాలని పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చింతకాయల విజయ్, రాజేశ్, ఆర్‌వై పాత్రుడు, అల్లు రామునాయుడు, రుత్తల శేషకుమార్, పోతల అప్పలనాయుడు, పోతల రాంబాబు, జోగిపాత్రుడు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనతో హైవే బంద్

అనకాపల్లి రూరల్, మార్చి 6: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గురువారం అనకాపల్లి జిల్లా పర్యటన సందర్భంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నట్టు ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. చేయూత పథకం నిధులు విడుదల చేసేందుకు పిసినికాడలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యే అవకాశం ఉన్నందున ఉదయం తొమ్మిదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నట్టు పేర్కొన్నారు. విశాఖ నుంచి అనకాపల్లి మీదుగా తుని వైపు వెళ్లే వాహనాలు లంకెలపాలెం జంక్షన్ నుంచి పరవాడ, అచ్యుతాపురం, ఎలమంచిలి, రేగుపాలెం జంక్షన్ మీదుగా వెళ్లాలన్నారు. అదే విధంగా తుని నుంచి అనకాపల్లి మీదుగా విశాఖ వైపు వెళ్లే భారీ వాహనాలు రేగుపాలెం జంక్షన్ వద్ద నుంచి ఎలమంచిలి, అచ్యుతాపురం, పరవాడ మీదుగా లంకెలపాలెం జంక్షన్‌కు చేరుకోవాలన్నారు. శ్రీకాకుళం వైపు నుంచి ఆనందపురం- అనకాపల్లి నాలుగు వరుసల జాతీయ రహదారి మీదుగా వచ్చే వాహనాలు సబ్బవరం వద్ద సర్వీసు రోడ్డులోకి మారి, అసకపల్లి, లంకెలపాలెం జంక్షన్, పరవాడ, అచ్యుతాపురం ఎలమంచిలి మీదుగా రేగుపాలెం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపైకి చేరుకుని తుని వైపు వెళ్లవచ్చునన్నారు. చోడవరం నుంచి తుని వైపు వెళ్లే వాహనాలు అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు, మునగపాక, అచ్యుతాపురం జంక్షన్, ఎలమంచిలి మీదుగా రేగుపాలెం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపైకి చేరుకుని తుని వెళ్లాలన్నారు.

28,247 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ



నమూనా చెక్కు విడుదల చేస్తున్న దృశ్యం

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 6: జిల్లాలో మిచౌంగ్ తుఫాన్ వల్ల పంట నష్టపోయిన 28,247 మంది రైతులకు రూ.11 కోట్ల 29 లక్షల 88 వేలు ఇన్‌పుట్ సబ్సిడీగా అందించినట్టు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన డీఆర్‌వో బి.దయానిధి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావులతో కలిసి రైతులకు నమూనా చెక్కును అందజేశారు. అంతకు ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సబ్సిడీ విడుదల కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్ నుంచి వీరంతా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిలకించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

విధులకు గైర్హాజరైన సచివాలయాల ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

మాకవరపాలెం, మార్చి 6: విధులకు గైర్హాజరైన మాకవరపాలెం, తామరం సచివాలయాల సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశామని ఎంపీడీవో జి.సుందరరావు తెలిపారు. ఆయన బుధవారం ఉదయం ఈ సచివాలయాలను తనిఖీ చేసి హాజరు పట్టికను పరిశీలించారు. మాకవరపాలెంలో ఐదుగురు సిబ్బందికి గాను ఇద్దరు విధులకు హాజరుకాలేదు. తామరంలో ఐదుగురు సిబ్బందికి ముగ్గురు విధులకు హాజరు కాలేదు. దీంతో ఈ ఐదుగురికి షోకాజ్ నోటీసులు జారీచేస్తున్నట్టు చెప్పారు.

ఉత్తరాంధ్ర సమస్యలపై సమాధానం చెప్పాలి

» ముఖ్యమంత్రికి కొణతాల రామకృష్ణ బహిరంగ లేఖ

కొత్తూరు, మార్చి 6 : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తరాంధ్ర సమస్యలపై సమాధానం చెప్పాలని మాజీ మంత్రి, అనకాపల్లి అసెంబ్లీ జనసేన - టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక బహిరంగ లేఖ రాశారు. అనకాపల్లి జిల్లాకు వస్తున్న ముఖ్యమంత్రికి స్వాగతం సుస్వాగతం అంటూనే పవన్‌కల్యాణ్, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును దూషించడానికి సమయం కేటాయిస్తారా?, లేక అనకాపల్లి జిల్లాతో పాటు ఉత్తరాంధ్ర ప్రజల తరఫున అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెబుతారో చెప్పాలని కోరారు. జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పి ఈ విషయాన్ని ఎందుకు మర్చిపోయారని ప్రశ్నించారు. 2019 జూన్ 1 నాటికి ఖాళీల భర్తీకి ఇచ్చిన నోటిఫికేషన్ విడుదల తరువాత ఎన్ని భర్తీ చేశారో చెప్పాలన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ వేస్తామని చెప్పిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఎన్నికల ముందు దగా డీఎస్సీ వేసి విద్యావంతులైన యువత జీవితాలతో చెలగాటం ఆడుతుండడం నిజమా కాదా? అని నిలదీశారు. ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తేదీన జీతాలు ఇస్తామని చెప్పిన హామీ ఏమైందన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి ఎన్ని నిధులు కేటాయించారో చెప్పాలని నిలదీశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరించకుండా తీసుకున్న చర్యలు ఏమిటని ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టులకు ఐదేళ్లలో ఎంత బడ్జెట్ కేటాయించారని?, అందులో ఎంత ఖర్చు చేశారని ప్రశ్నించారు. వెనుకబడిన ఉత్తరాంధ్రకు కేంద్రం ఎన్ని నిధులు కేటాయించిందో?, ఆ నిధులు ఏమయ్యాయో ప్రజలకు వివరించాలన్నారు. ఉత్తరాంధ్ర పెండింగ్ ప్రాజెక్టులపై ఎన్నిసార్లు సమీక్ష జరిపారు?, వలసలు అరికట్టడానికి తీసుకున్న చర్యలు ఏమిటని ప్రశ్నించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన నిధులను దారి మళ్లించిన మాట వాస్తవమా? కాదా? చెప్పాలన్నారు. వైసీపీ అధికారం చేపట్టిన తరువాత ఎన్ని కంపెనీలు వచ్చాయో ప్రజలకు చెప్పాలన్నారు. బస్సు చార్జీలు, కరెంటు చార్జీలు, ఇంటి పన్ను, చెత్త పన్ను, రిజిస్ట్రేషన్ చార్జీలు ఎన్నిసార్లు పెంచారో వివరించాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయడంలో తీసుకున్న చర్యలు ఏమిటో బహిరంగంగా ప్రజలకు వివరించాలన్నారు. వీటన్నింటిపై సభలో ప్రజలందరికీ వివరించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇంటర్ పరీక్షకు 15,258 మంది విద్యార్థులు హాజరు

అనకాపల్లి టౌన్, మార్చి 6:
అనకాపల్లి జిల్లాలో బుధవారం జరిగిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం మేథ్స్, బోటనీ, సివిక్స్ పరీక్షకు 15,258 మంది హాజరయ్యారని ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా అధికారి సుజాత తెలిపారు. ఈ పరీక్షకు 15,856 మంది హాజరుకావాల్సి ఉండగా 15,258 మంది హాజరయ్యారని తెలిపారు. 598 మంది హాజరుకాలేదన్నారు. జనరల్ విద్యార్థులు 12,984కి 12,562 మంది హాజరయ్యారన్నారు. ఒకేషనల్ విద్యార్థులు 2872కి 2696 మంది హాజరయ్యారని తెలిపారు.

షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించాలి

» సీఎంకు సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం లేఖ

అనకాపల్లి టౌన్, మార్చి 6: జిల్లాలో మూతపడిన తుమ్మపాల, తాండవ, ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీలను ఆధునికీకరించి తెరిపించాలని ముఖ్యమంత్రికి సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం లేఖ రాశారు. రైతులు పండించే పంటలకు, బెల్లం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. అచ్యుతాపురం, పరవాడ పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ చేసినప్పటికీ అమలు చేయడం లేదని, నోటిఫికేషన్ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాంబిల్లిలోని ఎన్ఏఓబీ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. విశాఖ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్యాకేజీ చెల్లించాలని, జిరాయితీ భూములతో సమానంగా డీ ఫారం, సాగుదారులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. జిల్లాలో అస్తవ్యస్తంగా ఉన్న రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు.

అనకాపల్లి నియోజకవర్గం

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం


జమ్మాదులపాలెంలో గోడౌన్‌ను ప్రారంభోత్సవంలో మంత్రి

అనకాపల్లి టౌన్/కశింకోట, మార్చి 6: పట్టణంలోని భీమునిగుమ్మ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో స్మార్ట్ క్యాంపస్‌ను బుధవారం మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించారు. సమస్యల పరిష్కారిని ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. అనంతరం బీఆర్ అంబేడ్కర్ ప్రాథమిక పాఠశాలలో నిర్మించిన స్మార్ట్ క్యాంపస్‌ను, బాలాజీరావుపేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే, కశింకోట మండలం వెదురుపర్తిలో ఆర్‌బీకే భవనాన్ని, రక్షిత మంచినీటి సరఫరా పథకాన్ని, అలాగే, పెదపాడులో పూడిమడక రోడ్డు నుంచి పెదపాడు మీదుగా వెదురుపర్తి బ్రిడ్జి వరకు నిర్మిచిన రోడ్డును, కొత్తపల్లిలో సచివాలయ భవనాన్ని, జమ్మాదులపాలెంలో గొడన్‌ను ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, ఎంపీపీ కలగ లక్ష్మి, వైసీపీ నాయకులు అద్దేపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'విభజన హామీల సాధనలో సీఎం విఫలం'



నిరసన తెలియజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

తుమ్మపాల, మార్చి 6 : ఏపీ విభజన హామీలు సాధించడంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శతశాతం విఫలమయ్యారని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మహంకాళి సుబ్బారావు ఆరోపించారు. ఈ మేరకు బుధవారం నెహ్రూచౌక్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఫెడరేషన్ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఏఐవైఎఫ్ నాయకులు గొంతిన ఉషాకిరణ్, వెంకట శ్రీను, చిన్న, సత్తిబాబు, అప్పారావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

అనకాపల్లి టౌన్, మార్చి 6 : స్థానిక గవరపాలెం సర్వకామదాంబ సమేత భోగలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను మంత్రి గుడివాడ అమర్‌నాథ్ బుధవారం ఆవిష్కరించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆలయ చైర్మన్ అల్ల నాగేశ్వరరావుకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

▸▸ అధికారులకు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశం ▸▸ పట్టణంలో పలు నిర్మాణాలు పరిశీలన


కల్యాణ మండపంలో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కమిషనర్

అనకాపల్లి టౌన్, మార్చి 6 : పట్టణంలో జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ బుధవారం పర్యటించారు. జిల్లా కలెక్టర్ సమావేశాలకు సిద్ధమవుతున్న గాంధీనగరంలోని కల్యాణ మండపాల భవనాన్ని, జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అలాగే శారదానది ఒడ్డున ఇటీవల పర్యాటకులకు అందుబాటులోకి వచ్చిన శాంతి పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా అభివృద్ధిపరిచిన శాంతిపార్కులో నిరంతరం పారిశుధ్యం, లైటింగ్, గ్రీనరీ పార్కు నిర్వహణతో పాటు సెక్యూరిటీ గార్డును కూడా నియమించి పార్కును పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. జోన్ పరిధిలోని అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మందపాటి సునీత, అధికారులు ఎం.దామోదరరావు, అయ్యప్పనాయుడు, రామ్మోహనరావు, గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా హక్కులు అమలు చేయాలి

▸▸ ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మాణిక్యం


మాట్లాడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మాణిక్యం

పరవాడ, మార్చి 6 : మహిళా హక్కులను పటిష్టంగా అమలు చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక జేఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. మహిళలపై రోజు రోజుకి దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా అవకాశాలు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక మహిళా కమిటీలు ఏర్పాటు చేశారు. మహిళా మండలి ప్రతినిధులు శ్రీదేవి, శివ, ఆదారి భవాని, జి.తిరుపతమ్మ, వై.నాగలక్ష్మి, బి.కుమారి, పి.లావణ్య, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన డీఎస్పీకి సత్కారం


సుబ్బరాజుకు జ్ఞాపికను అందిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్, మార్చి 6 : బదిలీపై వెళ్లిన డీఎస్పీ వి.సుబ్బరాజును ఇక్కడి పోలీస్ అతిథి గృహంలో జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ, ఇతర అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ బి.విజయభాస్కర్, పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కనీస వేతన జీవో ప్రకటన చేయాలి

అనకాపల్లి టౌన్, మార్చి 6 : జిల్లా కేంద్రం అనకాపల్లి పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి జగన్ కార్మికుల కనీస వేతనాల జీవోను ప్రకటించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి. కోటేశ్వరరావులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అతి తక్కువ వేతనాలతో జిల్లాలో పనిచేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు, ఆసుపత్రి పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు అమలు ప్రకటన చేయాలని కోరారు.

పాఠశాలలను సందర్శించిన ఐబీ బృందం

పరవాడ, మార్చి 6 : తానాంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గురుకుల విద్యాలయం, మండల పరిషత్ పాఠశాలను బుధవారం ఇంటర్నేషనల్ బాకలోరియట్ (ఐబీ) అధికారుల బృందం సందర్శించింది. ఐబీ బృందం సీనియర్ కర్క్యూమ్ డిజైన్ మేనేజర్ అల్బో, అసోసియేట్ మేనేజర్ మైఖేల్, ఎస్‌సీఈఆర్‌టీ ప్రొఫెసర్ కె.శ్రీనివాస్ పాఠశాలలో విద్యార్థులను పరీక్షించే విధానం, విశ్లేషణ తదితర అంశాల గూరించి తెలుసుకున్నారు. ఎంఈవో డి.దివాకరరావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.అప్పలనాయుడు, ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

75వ రోజుకు న్యాయవాదుల రిలే దీక్షలు


దీక్షలో నినాదాలిస్తున్న న్యాయవాదులు

అనకాపల్లి టౌన్, మార్చి 6 : ఇక్కడి కోర్టు బిల్డింగ్ వద్ద న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం 75వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షలో న్యాయవాదులు మళ్ల మాధవరావు, ఎస్‌వీఆర్ చార్యులు, ఎస్.నూకరాజు, సాయిలక్ష్మణ్, సుధాకర్, ఎం.గౌరీశంకర్, నగేష్, మళ్ల కుమార్, రాజు, కనిశెట్టి సురేష్‌బాబు పాల్గొన్నారు.

'నేత్రదానం ఎంతో గొప్పది'

అనకాపల్లి టౌన్, మార్చి 6 : నేత్ర దానం గొప్పదని ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి కో-ఆర్డినేటర్ కాత్యాయిని అన్నారు. జార్జిక్లబ్ ఆవరణలో బుధవారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడారు. ప్రతినిధులు వి.ఎల్.ఎం.శర్మ, వి.సత్యనారాయణ, స్వామి పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమమా? వైసీపీ బహిరంగ సభా?

... 5వ పేజీ తరువాయి

అన్నట్టుగా వుంది పరిస్థితి. ఎన్నికలు సమీపిస్తుండడంతో సీఎం అధికారిక కార్యక్రమాన్ని వైసీపీ నాయకులు ప్రచార వేదికగా మార్చుకుంటున్నారు. సభా ప్రాంగణం వద్ద వైసీపీ జెండాలను ఏర్పాటు చేశారు. అనకాపల్లి నియోజకవర్గం సమన్వయకర్త పేరుతో సీఎంకు స్వాగతం పలుకుతూ ఎడాపెడా ఫెక్సీలు ఏర్పాటు చేశారు. ఇక సీఎం సభను జయప్రదం చేయాలని స్వయంగా కలెక్టర్ ప్రకటన విడుదల చేయడం విడ్డూరంగా వుంది. అంతేకాకుండా సీఎం సభకు జన సమీకరణ బాధ్యతను కూడా అధికారులు భుజాని కెత్తుకున్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి మహిళలను సభకు తరలించేందుకు సుమారు 250 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు.

నేడు సీఎం జగన్ రాక

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం అనకాపల్లి రానున్నారు. గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి ఉదయం 10.20 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.45 గంటలకు కశింకోట ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 10.50 గంటలకు బస్సులో బయలుదేరి పిసినికాడలో ఏర్పాటు చేసిన బహిరంగ సభా వేదిక వద్దకు వస్తారు. కలెక్టరు రవి పట్టన్‌శెట్టి అధ్యక్షతన ఏర్పాటు చేసిన 'చేయూత' నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడతారు. అనంతరం బటన్ నొక్కి నిధులు విడుదల చేస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల వరకు వైసీపీ నాయకులతో సమావేశమవుతారు.

2.10కు హెలికాప్టర్‌లో విశాఖ విమానాశ్రయానికి బయలుదేరతారు. అక్కడి నుంచి 2.30 గం టలకు విమానంలో విజయవాడకు బయలుదేరతారు. ఇది లావుండగా ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పా ట్లను మంత్రి గుడివాడ అమర్‌నాథ్ బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద హెలికాప్టర్‌తో ట్రయల్ రన్ నిర్వహించారు.

పెందుర్తి నియోజకవర్గం

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే


వెల్నెస్ సెంటర్ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం, మార్చి 6: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నట్టు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మొగలిపురంలో నిర్మించిన వెల్నెస్ సెంటర్ భవనం, ఆదిరెడ్డిపాలెంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ఎంపీపీ బోకం సూర్యకుమారి, వైసీపీ మండల అధక్షుడు కర్రి బాబు, నేతలు యడ్ల నాయుడు, బోకం రామునాయుడు, యడ్ల నాయుడు, కొటాన రాము, నారాయణమూర్తి, ఐడి బాబు, ఎంపీటీసీ గొర్లి కనకరాజు, బండారు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పది మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, మార్చి 6 : బొద్దపువానిపాలెం గ్రామానికి చెందిన సియాద్రి సన్యాసినాయుడు మంగళవారం రాత్రి ప్రభుత్వ దుకాణం నుంచి పది క్వార్టర్ మద్యం సీసాలను తీసుకు వెళ్తుండగా ఎస్ఐ మల్లేశ్వరరావు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఫిషింగ్ హార్బర్ హుష్ కాకి!

... 5వ పేజీ తరువాయి

వుండడానికి తూతూమంత్రంగా విశ్వ సముద్ర కన్‌స్ట్రక్షన్ కంపెనీకి టెండర్ అప్పగించారన్న వాదన వినిపిస్తున్నది.

త్వరలో పనులు ప్రారంభం
- ప్రసాద్, మత్స్య శాఖ జేడీ

పూడిమడక వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు ప్రారంభం కావాలంటే రహదారి అవసరం. లోవపాలెం రోడ్డులో జగనన్న కాలనీ నుంచి రోడ్డు వేయాలి. ఇందుకోసం ప్రైవేటు వ్యక్తుల నుంచి 58 సెంట్లు సేకరించాలి. ఆయా వ్యక్తులకు నష్టపరిహారం కాకుండా ప్రత్యామ్నాయ భూమి ఇవ్వడానికి చర్చలు జరుగుతున్నాయి. భూమిని సేకరించిన వెంటనే రోడ్డు నిర్మిస్తారు. అనంతరం ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు మొదలవుతాయి.

పడకేసిన మెగా నీటి పథకం

... 5వ పేజీ తరువాయి

పనులు 40 నుంచి 50 శాతం మాత్రమే పూర్తి చేశారు. మొత్తం మీద రూ.22 కోట్ల విలువైన పనులు అయ్యాయి. పనులు చేపట్టిన కాంట్రాక్టు కంపెనీలకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. దీంతో సుమారు ఏడాది క్రితం పనులు ఆపేశారు. మరోవైపు నర్సీపట్నం, బలిఘట్టం, పెదబొడ్డేపల్లిల్లో పైపు లైన్లు వేయడానికి సిమెంటు రోడ్లు తవ్వేశారు. కొన్ని చోట్ల పైపులైన్ వేసినప్పటికీ గోతులను మట్టితో పైపైన పూడ్చారు. దీంతో సిమెంట్ రోడ్లు అధ్వానంగా తయారై రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ఎలమంచిలి నియోజకవర్గం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు

టీడీపీ-జనసేన విజయం ఖాయం

▸▸ మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు

ఎలమంచిలి, మార్చి 6: నియోజకవర్గంలో టీడీపీ-జనసేన అభ్యర్థి విజయం ఖాయమని మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు చెప్పారు. బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ శ్రేణులంతా విజయమే ధ్యేయంగా ప్రజల మధ్యలోనే ఉండాలన్నారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి అనుగుణంగా సమిష్టిగా ముందడుగు వేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరావు మాట్లాడుతూ ప్రజారంజక పాలన అందించాలన్నా, నియోజకవర్గం మరింత అభివృద్ధి బాటలో పయనించాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని పేర్కొన్నారు. పార్టీ పరిశీలకులు జగన్నాథం, రాష్ట్ర కార్యదర్శి దూలి రంగనాయకులు, పార్టీ శ్రేణులకు సూచనలు అందించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గొర్లె నానాజీ, ఎ.రమణబాబు, నాయకులు దిన్‌బాబు, కె.చిరంజీవి, దొడ్డి శ్రీను, జి.నాగేశ్వరావు, బి.శ్రీను, ఆడారి ఆదిమూర్తి, డి.దేవి పాల్గొన్నారు.

'సీపీఎం పోరాటంతో రోడ్డు పనులు'

అచ్యుతాపురం రూరల్, మార్చి 6: సీపీఎం పోరాటాల ఫలితంగా అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు మరమ్మతులు చేస్తున్నారని పార్టీ మండల కన్వీనర్ రొంగలి రాము హర్షం వ్యక్తం చేశారు. ఈ రోడ్డు పునర్నిర్మించాలని ఆందోళనలు, పోరాటాలు, సంతకాల సేకరణ వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఫలితంగా ప్రభుత్వం దిగివచ్చి రూ.6.5 కోట్లతో పనులు ప్రారంభించినట్టు చెప్పారు. నాణ్యతాప్రమాణాలతో రహదారి నిర్మాణం చేపట్టాలని ఆయన కోరారు.

బీసీ డిక్లరేషన్‌కు అనూహ్య స్పందన: అనిత

నక్కపల్లి, మార్చి 6: మంగళగిరిలో జరిగిన టీడీపీ-జనసేన బీసీ సభలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌కు అనూహ్య స్పందన లభిస్తోందని టీడీపీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత చెప్పారు. స్థానికంగా వున్న ఆమె నివాసం వద్ద బుధవారం నియోజకవర్గ స్థాయి టీడీపీ సమన్వయకమిటీ సమావేశం జరిగింది. త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నందున నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాల్లో వున్న ప్రధాన సమస్యలను గుర్తించి, మేనిఫెస్టో తయారు చేసి విడుదల చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. ఐదేళ్లలో పాయకరావుపేట నియోజకవర్గంలో అభివృద్ధి ఎక్కడా కానరావడం లేదన్నారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పాటయ్యాయ, నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు అవసరమై ప్రణాళికలు రూపొందించుకోవాలని నిర్ణయించామన్నారు. ఈ విషయాన్ని ప్రతీ ఒక్కరికి తెలియజేయాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ టీడీపీ నాయకులు లాలం కాశీనాయుడు, పెదిరెడ్డి చిట్టిబాబు, కె.వెంకటేశ్, కొండబాబు, బుజ్జి, ఎ.అబద్దం, గుర్రం రామకృష్ణ, వైబోయిన రమణ, గింజాల లక్ష్మణరావు, దేవర సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న అనిత

వైసీపీ అభివృద్ధి మాటల్లోనే.. చేతల్లో శూన్యం

▸▸ టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు

మునగపాక (తుమ్మపాల), మార్చి 6: వైసీపీ అభివృద్ధి మాటల్లోనే తప్ప చేతల్లో కనిపించడం లేదని టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు ఆరోపించారు. తోటాడ పంచాయతీలోని గవర్ల అనకాపల్లి వద్ద నిర్మించిన బ్రిడ్జికి అప్రోచ్ రోడ్డు కూడా నిర్మించాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2012లో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఆర్‌డీఎఫ్ నిధులు రూ.కోటి 13 లక్షలతో నూతనంగా బ్రిడ్జి నిర్మించడం జరిగిందన్నారు. అప్పటి నుంచి అప్రోచ్ రోడ్డు నిర్మాణం జరగలేదన్నారు. అప్పటి శాసనసభ్యుడే ఇప్పుడు ఉన్నప్పటికీ అతీగతి లేకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కర్రి సాయికృష్ణ, పెంటకోట విజయ్, కాండ్రేగుల నాగేంద్ర, పి.అప్పారావు, జె.కె.నాయుడు, సబ్బి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధిగా జానకి

మునగపాక (తుమ్మపాల), మార్చి 6: తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఆడారి జానకి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం మాజీ ఎంపీ పప్పల చలపతిరావును కలిసి ఆయనకు దుశ్శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన వారందరికీ గుర్తింపు ఉంటుందని చెప్పారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. మహిళా ఓటర్లను చైతన్యవంతులను చేసి ప్రభుత్వ వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కృషి చేయాలని జానకికి ఆయన సూచించారు.

మహిళను కాపాడిన రైల్వే పోలీసులు

పాయకరావుపేట, మార్చి 6: తుని రైల్వే స్టేషన్‌కు వచ్చి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించిన పాయకరావుపేట మండలం రత్నయమ్మపేట గ్రామానికి చెందిన మహిళను రైల్వే పోలీసులు కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సంఘటనకు సంబంధించి తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ బుధవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. పాయకరావుపేట మండలం రత్నయమ్మపేటకు చెందిన ముక్తి మేరి అనే మహిళ ఇంటి వద్ద భర్తతో గొడవపడి తన పెద్దకుమారుడితో కలిసి బుధవారం సాయంత్రం తుని రైల్వే స్టేషన్ వచ్చింది. ఇక్కడ ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నిస్తుండగా, ఆ సమయంలో రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారమ్‌పై డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ గణేష్ గమనించారు. మహిళ వద్దకు అతను వెంటనే వెళ్లి వారించి రైల్వే పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చారని ఎస్ఐ వివరించారు.

భూ వివాదంలో ఆరుగురిపై కేసు నమోదు

అచ్యుతాపురం రూరల్, మార్చి 6: భూ వివాదానికి సంబంధించి ఆరుగురిపై కేసు నమోదు చేశామని సీఐ బుచ్చిరాజు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. బోగాపురానికి చెందిన కూండ్రపు వరలక్ష్మి, వెంకటరావులకు చెందిన 11 సెంట్ల భూమిని కబ్జా చేసేందుకు బుధవారం తెల్లవారుజామున కొందరు రౌడీలు వచ్చినట్టు సమాచారం అందిందని సీఐ తెలిపారు. తన సిబ్బందితో అక్కడికి వెళ్లి బెదిరింపులకు పాల్పడిన గండి శ్రీను, గండి లక్ష్మణ్, చీపురుపల్లి రాము, గండి రాము, లాలం రవి, బండారు దండి నాయుడులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. కాగా గ్రామంలోని వైసీపీ నాయకుడు తమ భూములపై కన్నేసి రౌడీలను పంపించి కత్తులు, కర్రలతో దాడి చేశారని, పోలీసులు చర్యలు చేపట్టలేదని వరలక్ష్మి ఆరోపించారు. దీనిపై సీఐ వివరణ కోరగా అలాంటిది ఏమీ జరగలేదని, సమాచారం అందుకున్న వెంటనే తాము వెళ్లి పరిస్థితిని చక్కదిద్దామన్నారు.

'బీసీల సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం'

రాంబిల్లి, మార్చి 6: బీసీల సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యపడుతుందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కశిరెడ్డి ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద బీసీ శ్రేణులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం బీసీలకు అన్ని విధాలా అన్యాయం చేసిందన్నారు. విజయవాడలో జరిగిన బీసీ మహాసభలో చంద్రబాబు బీసీ డిక్లరేష్‌లో పేర్కొన్న సుమారు 17 అంశాలు బీసీల అభివృద్ధి, సంక్షేమానికి ఎంతో దోహదపడతాయన్నారు. బీసీలంతా ఐక్యతగా ఉండి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విజయవాడలో జరిగిన బీసీల మహాసభను విజయవంతం చేసిన బీసీ సోదరులకు ప్రసాద్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు మంగరాజు తదితరులు ఉన్నారు.

దిమిలి ప్రభుత్వ ఆసుపత్రిలో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన

రాంబిల్లి, మార్చి 6: దిమిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో టోయోట్స్ కంపెనీ టీఎస్ఆర్ నిధులు రూ.25 లక్షలతో నిర్మించనున్న అదనపు గదుల నిర్మాణానికి ఎలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు బుధవారం తను కుమారుడు మాజీ డీసీసీబీ చైర్మన్ యు.సుకుమార్‌వర్మతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు అన్ని సౌకర్యాలతో మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. గ్రామీణ ప్రజలు దిమిలి పీహెచ్‌సీలో అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా టొయోట్స్ కంపెనీ ప్రతినిధులు దిమిలిలో పారిశుధ్య పనుల నిమిత్తం రూ.8.5 లక్షలు విలువ చేసే ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే అందజేశారు. అలాగే పంచదార్ల, మురకాడ, హరిపురం, కొత్తపట్నం సచివాలయాల పరిధిలో జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ఇంటి పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమార్‌వర్మ, జడ్‌పీటీసీ సభ్యులు ధూళి నాగరాజు, వైస్ ఎంపీపీ కె.నరసింగరావు ఎంపీపీ జి.శిరీషా, వైసీపీ మండల కన్వీనర్ పి.కిశోర్, దిమిలి సర్పంచ్ బంగారు చిలుకు, మాజీ సర్పంచ్ కొటాపు వడ్డీకాసులు, వైస్ ఎంపీపీ కె.నరసింగరావు, సచివాలయం మండల కన్వీనర్ కె.రామకృష్ణ పాల్గొన్నారు.

డ్రోన్‌తో మందుల పిచికారీ లాభదాయకం

రాంబిల్లి, మార్చి 6: వరిపైరుకు డ్రోన్ సహకారంలో మందులు పిచికారీ చేయడం లాభదాయకమని బీసీటీ కృషివిజ్ఞానేంద్రం యాంత్రీకరణ శాస్త్రవేత్త శ్రీకాంత గౌడ అన్నారు. మండలంలోని కుమ్మరాపల్లి గ్రామంలో బుధవారం వరిపైరుకు పిచికారీ ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ రాంబిల్లి మండలంలోని పలు గ్రామాల్లో వరిపంటను అగ్గి తెగులు, కాండం తొలిచే పురుగులు ఆశించాయని, వీటి నివారణకు సుమారు 100 ఎకరాల్లో డ్రోన్ ద్వారా మందులను పిచికారీ చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డి.శ్రీహరిరావు, డాక్టర్ వానాప్రసాద్, బి.పృథ్వీలాల్ (సీనియర్ సేద్య నిపుణులు) ఎస్.రమేష్‌బాబు, రైతులు ఉన్నారు.

పాయకరావుపేట నియోజకవర్గం

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు


నక్కపల్లి, మార్చి 6: మండలంలోని డీఎల్ పురంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, హెల్త్ సెంటర్, రైతుభరోసా కేంద్రాల భవనాలను ఎంపీ డాక్టర్ సత్యవతి, ఎమ్మెల్యేలు బాబూరావు, కంబాల జోగులు బుధవారం ప్రారంభించారు. ఉద్దండపురం గ్రామంలో రైతు భరోసా కేంద్రం, గునిపూడిలో కమ్యూనిటీ హాలును, చినదొడ్డిగల్లులో సచివాలయం భవనాలను ప్రారంభించారు. అనంతరం ఒడ్డిమెట్ట గణపతి ఆలయాన్ని దర్శించుకున్నారు. కార్యక్రమాల్లో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ రత్నం, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైసీపీ మండల అధ్యక్షుడు శీరం నరసింహమూర్తి, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, నాయకులు చంద్రరావు, మణిరాజు, పాపారావు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో...


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

పాయకరావుపేట రూరల్: మండలంలోని మంగవరం ఎస్సీ కాలనీలో రూ.20 లక్షలతో నిర్మించనున్న సామాజిక భవనం నిర్మాణానికి ఎంపీ డాక్టర్ సత్యవతి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తున్నదన్నారు. ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లాడుతూ గ్రామాల్లో కోట్లాది రూపాయలతో సచివాలయ, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల భవనాలను నిర్మించి ప్రజల ముంగిటకే పరిపాలనను తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో రాజాం ఎమ్మెల్యే, పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల జోగులు, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ చిక్కాల రామారావు, ఎంపీడీవో కె.స్వప్న, తహసీల్దార్ సూర్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్‌కన్నా, వైసీపీ నాయకులు డి.సాయిబాబా, వి.రామారావు, ఐ.తాతారావు, జి.రామగోవిందు, జె.శ్రీనివాసరావు, చేపల తాతాజీ, పుత్రరావు, నాగేశ్వరరావు, కార్యదర్శి జె.నరేశ్ పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు


సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేస్తున్న భక్తులు

నక్కపల్లి, ఫిబ్రవరి 6: మండల కేంద్రమైన నక్కపల్లిలో బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఘనంగా జరిగాయి. శ్రీపాద ప్రణవ్‌రాం, డీవీ రామారావు ఆధ్వర్యంలో ఇందుకోసం ఏర్పాట్లు చేపట్టారు. అనేక మంది దంపతులు ఈ వ్రతం ఆచరించారు. వేద పండితులు తేజ, పందుశర్మ, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, ఉపమాక దేవస్థానం ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, ఆలయ మాజీ చైర్మన్ పెంకులరాజు, ఎన్ఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణ చర్యలేవీ?

- రైతులకు మేలు చేస్తున్నామంటూ ప్రకటనలకే పరిమితం
- ఇళ్లలో ఉన్న ఉపాధి పథకం కూలీలకు మస్తర్లా..!
- సమస్యలపై అధికారులను నిలదీసిన సభ్యులు
- వాడీవేడిగా మాడుగుల మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజారాం

మాడుగుల, మార్చి 6 : గ్రామాల్లో సమస్యలపై ప్రజాప్రతినిధులు గళమెత్తారు. అధికారుల పని తీరును ఎండగట్టారు. ఇక్కడి మం డల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం అధ్య క్షతన బుధవారం మాడుగుల మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటైంది. ఈ సందర్భంగా గత ఏడాది బడ్జెట్, ఖర్చులు తదితరాలతో పాటు రానున్న ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులను అధికారులు సభకు వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నరసింహారావు మాట్లాడుతుండగా, పలు గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు లేచి వేసవి సమీపిస్తున్నప్పటికీ గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎందుకు చర్య లు చేపట్టడం లేదని నిలదీశారు. అదే విధంగా ఇంటింటి కుళాయి కనెక్షన్ల పేరుతో పైపులైన్లు అమర్చేందుకు రోడ్లను ఇష్టానుసారంగా తవ్వి విడిచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో బోర్లు పాడైనా పట్టించుకునేవారు కరువయ్యారని వాపోయారు. మండల వ్యవసాయాధికారి వాసుదేవరావు మాట్లాడుతూ రైతుల నుంచి ఆర్‌బీకేల ద్వారా 5,533 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్టు చెప్పా రు. ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో వేసిన నగదు, మిచౌంగ్ తుఫాన్‌లో పంట నష్టపోయిన రైతులకు సంబంధించి పరిహారం వివరాలను వెల్లడిస్తుండగా, సత్యవరం ఎంపీటీసీ అప్పారావు లేచి మాట్లాడారు. రైతులకు అన్ని విధాలుగా మేలు చేశామని సమావేశాల్లో చెప్పడం తప్పితే, క్షేత్రస్థాయిలో జరిగిన న్యాయం కనిపించలేని ఎద్దేవా చేశారు. రైతు భరోసా కేంద్రం ద్వారా అన్ని గ్రేడ్ టెస్టులు పూర్తయ్యాక నాణ్యమైన పది టన్నుల ధాన్యం పంపిస్తే, పంపిన ధాన్యంలో నాణ్యత లేదని, అరటన్ను కోతవేసి మిగిలిన వాటికి నగదు వచ్చేలా లెక్క కడతామని మిల్లు యజమాని దౌర్జన్యంగా వ్యవహరించారని సభ దృష్టికి తీసుకు వచ్చారు. చివరకు ఎన్ని విధాలుగా చెప్పిన తరువాత కొంతమేర కోత విధిం చారని వాపోయారు. అవగాహన ఉన్న తమ దగ్గరనే దోపిడీ చేసేందుకు సిద్ధపడితే ఇక సామాన్య రైతు పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకంలో భాగం వంద రోజులు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నామని ఏపీవో ఈశ్వ రరావు చెపుతుండగా, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాసరావు కలుగజేసుకొని కష్టపడిన ఉపాధి కూలీలకు తీరని అన్యాయం జరుగుతుంద న్నారు. ఉపాధి హామీ పనుల్లో జరుగుతున్న అవకతవకలపై పర్యవేక్షణ కొరవడిందని ఆరోపించారు. పనులకు వెళ్లకుండా ఇంటిదగ్గర ఉన్న కూలీలకు పనులు కల్పించి వందరోజులకు సంబంధించిన పనులకు మస్తర్లు వేసి నగదు అందిస్తున్నారని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తన వద్ద ఉన్నాయని, వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసు కువెళతానని తెలిపారు. అలాగే పట్టాదారు పాసుపుస్తకాలు, ఆన్‌లైన్ వంటి సమస్యలపై రెవెన్యూ అధికారులను పలువురు సభ్యులు నిలదీశారు. ఎంపీపీ రాజారాం మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పనులను అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఆర్.కాశీ ప్రసాదరావు, తహసీల్దార్ పి.సత్యనారాయణ, జడ్పీటీసీ కిముదు రమణమ్మ, ఈవోపీఆర్‌డీ మీనాకుమారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సేనాపతి కొండలరావుతో పాటు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పడకేసిన మెగా నీటి పథకం

... 5వ పేజీ తరువాయి

పనులు 40 నుంచి 50 శాతం మాత్రమే పూర్తి చేశారు. మొత్తం మీద రూ.22 కోట్ల విలువైన పనులు అయ్యాయి. పనులు చేప ట్టిన కాంట్రాక్టు కంపెనీలకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. దీంతో సుమా రు ఏడాది క్రితం పనులు ఆపేశారు. మరోవైపు నర్సీపట్నం, బలిఘట్టం, పెద బొడ్డేపల్లిల్లో పైపు లైన్లు వేయ డానికి సిమెంటు రోడ్లు తవ్వేశారు. కొన్ని చోట్ల పైపులైన్ వేసినప్పటికీ గోతులను మట్టితో పైపైన పూడ్చారు. దీంతో సిమెంట్ రోడ్లు అధ్వానంగా తయారై రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.


పెద్ద చెరువు వద్ద ఏడాదిన్నర క్రితం ఎమ్మెల్యే గణేశ్ ఆవిష్కరించిన శిలాఫలకం

ప్రభుత్వ కార్యక్రమమా..? వైసీపీ బహిరంగ సభా?

... 5వ పేజీ తరువాయి

అన్నట్టుగా వుంది పరిస్థితి. ఎన్నికలు సమీపిస్తుండడంతో సీఎం అధికారిక కార్యక్రమాన్ని వైసీపీ నాయకులు ప్రచార వేదికగా మార్చుకుంటున్నారు. సభా ప్రాంగణం వద్ద వైసీపీ జెండాలను ఏర్పాటు చేశారు. అనకాపల్లి నియోజకవర్గం సమన్వయకర్త పేరుతో సీఎంకు స్వాగతం పలుకుతూ ఎడాపెడా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇక సీఎం సభను జయప్రదం చేయాలని స్వయంగా కలెక్టర్ ప్రకటన విడుదల చేయడం విడ్డూరంగా వుంది. అంతేకాకుండా సీఎం సభకు జన సమీకరణ బాధ్యతను కూడా అధికారులు భుజానికెత్తుకున్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి మహిళలను సభకు తరలించేందుకు సుమారు 250 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు.

నేడు సీఎం జగన్ రాక

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం అనకాపల్లి రానున్నారు. గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి ఉదయం 10.20 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.45 గంటలకు కశింకోట ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 10.50 గంటలకు బస్సులో బయలుదేరి పిసినికాడలో ఏర్పాటు చేసిన బహిరంగసభా వేదిక వద్దకు వస్తారు. కలెక్టరు రవి పట్టన్‌శెట్టి అధ్యక్షతన ఏర్పాటు చేసిన 'చేయూత' నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడతారు. అనంతరం బటన్ నొక్కి నిధులు విడుదల చేస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల వరకు వైసీపీ నాయకులతో సమావేశమవుతారు. 2.10 గంటలకు హెలికాప్టర్‌లో విశాఖపట్నం విమానాశ్రయానికి బయలుదేరతారు. అక్కడి నుంచి 2.30 గంటలకు విమానంలో విజయవాడకు బయలుదేరతారు. ఇదిలావుండగా ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాట్లను మంత్రి గుడివాడ అమర్‌నాథ్ బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద హెలికాప్టర్‌తో ట్రయల్ రన్ నిర్వహించారు.

జగన్‌ను చిత్తుగా ఓడించండి

- వైసీపీ పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు
- చంద్రబాబు వంటి సమర్థుడికి పట్టం కట్టండి : ఎన్నికల ప్రచారంలో అయ్యన్న


కేఎల్‌పురంలో ఎన్నికల శంఖారావంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం అర్బన్, మార్చి 6: గత ఎన్నికల్లో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఈసారి ప్రజలంతా చిత్తుగా ఓడించి, ఇంటికి పంపించాలని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు.మండంలోని కేఎల్‌పురంలో బుధవారం రాత్రి ఎన్నికల శంఖారావాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జగన్ పాలనలో రాష్ట్ర అన్నిరంగాల్లో వెనుకబడిపోయిందన్నారు. అన్నింటి ధరలు పెరిగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. మళ్లీ రాష్ట్రం ప్రగతి సాధించాలన్నా, ప్రజల కష్టాలు తీరాలన్నా చంద్రబాబువంటి సమర్థ నాయకుడికి పట్టం కట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాష్ట్రాన్ని అప్పులమయంగా, అవినీతిమయంగా జగన్ మార్చేశారని ఎద్దేవా చేశారు. అన్నివర్గాల ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. గతంలో తన హయాంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. తనకు ఆఖరి అవకాశంగా ఓటు వేసి గెలిపించాల్సిందిగా ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, జడ్పీటీసీ సుకల రమణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు లాలం శ్రీరంగస్వామి, ఎంపీటీసీ బోళెం రామ్‌ప్రసాద్, స్థానిక సర్పంచ్ గెడ్డం అచ్చియ్యమ్మ రాజుముల్లు దంపతులతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

టీడీపీ 'సూపర్ సిక్స్'తో అన్నివర్గాలకు మేలు


టీడీపీ సమావేశంలో మాట్లాడుతున్న పీవీజీ కుమార్

చీడికాడ, మార్చి 6 : టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో అన్నివర్గాల ప్రజలకు మేలు కలుగుతుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్ అన్నారు. చీడికాడలోని కార్యాలయంలో ఇందుకు సంబంధించి క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలతో బుధవారం రాత్రి ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. సూపర్‌సిక్స్ పథకాలపై ప్రతి ఒక్కరూ ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేయడమే అందరి లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. మాజీ జడ్పీ టీసీ కసిరెడ్డి అప్పలనాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జిలు లెక్కల మల్లేశ్వరరావు, దొగ్గ దేముడునాయుడు, పుప్పాల రమేష్, కన్నూరు సూర్యనారాయణ, యూనిట్ ఇన్ చార్జిలు వెంకన్నదొర, మజ్జి బాబ్జి, దొగ్గ వరహామూర్తి, రాళ్లపల్లి శ్రీరామ్మూర్తి, గుల్లే పల్లి ఎంపీటీసీ దేముడుబాబు తదిత రులు పాల్గొన్నారు.

'టీడీపీ-జనసేన డిక్లరేషన్‌తో బీసీల్లో ఆనందం'


మాట్లాడుతున్న తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, మార్చి 6 : టీడీపీ- జనసేన కూటమి ప్రకటించిన డిక్లరేషన్‌తో బీసీవర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని టీడీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు అన్నారు. బుధవారం వడ్డాది పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ బీసీల సంక్షేమాన్ని విస్మరించిందని ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 30 సంక్షేమ పథకాలను రద్దుచేయడంతో బీసీలు అన్యాయానికి గురయ్యారని వాపోయారు. జగన్‌రెడ్డి పాలనలో 300 మందికి పైగా బీసీలు హత్యకు గురైయ్యారని, వారిపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం రూ.75వేల కోట్లు బీసీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించి, వారి పొట్టకొట్టిందని విమర్శించారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు గోకివాడ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గొలుగొండలో అర్ధరాత్రి బస్ షెల్టర్ కూల్చివేత


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఎస్‌ఐ

గొలుగొండ, మార్చి 6 : మండల కేంద్రం గొలుగొండలో పీహెచ్‌సీకి వెళ్లే రహదారిలో గల బస్ షెల్టర్‌ను మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తు కూల్చివేసినట్టు స్థానిక సర్పంచ్ కసిపల్లి అప్పారావు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంపీడీవో రత్నకుమారి, ఎస్‌ఐ కృష్ణారావు సదరు ప్రదేశాన్ని పరిశీలించారు. ఈఘటనపై కేసు నమోదు చేయనున్నట్టు ఎస్‌ఐ చెప్పారు. ఇదిలావుంటే, ప్రయాణికులతో పాటు పీహెచ్‌సీకి వచ్చే రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే షెల్టర్‌ను కూల్చివేడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి నిందితులను కఠినంగా శిక్షించాలని, అలాగే, బస్ షెల్టర్‌ను అధికారును పునర్నిర్మించాలని అంతా కోరుతున్నారు.

ఉత్సాహంగా ఎడ్లబండ్ల పరుగు పోటీలు


పోటీలో పరుగుతీస్తున్న ఎడ్ల బండి

రావికమతం, మార్చి 6 : మండల కేంద్ర రావికమతంలో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఎడ్ల బండ్ల పరుగు పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థానంలో కె.కోటపాడు మండలం కేఎల్‌బీపట్నానికి చెందిన ఒప్పలరెడ్డి మోహన్ బండికి నిలిచింది. ద్వితీయ, తృతీయ స్థానాల్లో డి.సురవరానికి చెందిన వర్ధన్‌నాయుడు, చుక్కపల్లికి చెందిన మజ్జి రాజేంద్ర బండ్లు గెలుపొందాయి. వీరితో పాటు మరికొన్ని బండ్ల యజమానులకు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు, ఎంపీటీసీ గంజి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధారమఠం, కల్యాణపులోవలకు 50 ప్రత్యేక బస్సులు

నర్సీపట్నం, మార్చి 6: మహా శివరాత్రి సందర్భంగా నర్సీపట్నం నుంచి గొలుగొండ మండలం ధారమఠం, రావికమతం మండం కల్యాణపులోవ పుణ్యక్షేత్రాలకు 50 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు పీటీడీ నర్సీపట్నం డిపో మేనేజర్ ఎంఎస్ఎస్ ధీరజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదీ సాయంత్రం నుంచి 9వ తేదీ సాయంత్రం వరకు సాధారణ బస్సు చార్జీలతో ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. నర్సీపట్నం, కొత్తకోట, డొండపూడి, రావికమతం, కొంతలం, కశిరెడ్డిపాలెం నుంచి కళ్యాణపులోవకు; నర్సీపట్నం, గొలుగొండ, కృష్ణాదేవిపేట, కొయ్యూరు మండలం కంఠారం గ్రామాల నుంచి ధారమఠానికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు చెప్పారు.

'అమలు నోచుకోని ఎమ్మెల్యే ధర్మశ్రీ హామీలు'

రావికమతం, మార్చి 6: మండలంలోని కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకలతో సామాజిక ఆరోగ్యం కేంద్రంగా అప్‌గ్రేడ్ చేయిస్తానని నాలుగున్నరేళ్ల క్రితం ఇచ్చిన హామీని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఇంతవరకు అమలు చేయలేదని దళిత బహుజన సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ మల్లేటి రాజు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో బుధవారం కొత్తకోట పీహెచ్‌సీ వద్ద నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, ఎమ్మెల్యేగా గెలిచిన కొద్ది రోజుల్లోనే ధర్మశ్రీ కొత్తకోట వచ్చారని, పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయిస్తానని, ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయిస్తానని బహిరంగంగానే ప్రజలకు హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

మరికొద్ది రోజుల్లో ఆయన పదవీ కాలం ముగుస్తుందని, కొత్తకోట ప్రజలకు ఇచ్చిన ఈ రెండు ప్రధాన హామీల్లో ఒక్కటి కూడా అమలుకు నోచుకోలేదని అన్నారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో వున్న మదర్ థెరెసా విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కె.నాగేశ్, జి.సాయిచంద్ర, బి.రమణ, ఎల్.చంద్రకుమార్, జి.హరిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ

దేవరాపల్లి/చీడికాడ, మార్చి 6 : జగనన్న ఇళ్ల కాలనీలే అవుట్ లలో ఇళ్లు నిర్మించుకున్న వారికి రిజిస్ట్రేషన్ పత్రాలను ఉప ముఖ్యమంత్రి బూడిముత్యాల నాయుడు బుధవారం తారువ క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. తారువ గ్రామంలో పది మంది, అప్పలరాజపురంలో 31మంది లబ్ధిదారులకు వీటిని అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, లాలం జానకీరాం, కురచా జయమ్మ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. అలాగే, చీడికాడ మండలం అప్పలరాజుపురంలో పలువురికి బూడి ముత్యాల నాయుడు రిజిస్ట్రేషన్ పత్రాలను అందించారు. ఎంపీపీ కురచా జయమ్మ, జడ్పీటీసీ లాలం శారదావరలక్ష్మి, సర్పంచ్ చుక్క అప్పలనాయుడు, తహసీల్దార్ జె.ప్రకాశరావు, వీఆర్‌వో వంటాకు కొండలరావు, లాలం జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

బలిరెడ్డి సత్యారావు విగ్రహం ఆవిష్కరణ


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ధర్మశ్రీ

చోడవరం, మార్చి 6 : నిరాడంబర రాజకీయాలకు నిలువెత్తు రూపంగా మాజీ మంత్రి బలిరెడ్డి ప్రజల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని విప్ ధర్మశ్రీ అన్నారు. బలిరెడ్డి సత్యారావు స్వగ్రామం పీఎస్‌పేటలో బుధవారం ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఆయన గొప్పతనం గురించి వివరించడంతో పాటు, పట్టణంలో ఆయన పేరిట స్మారక పార్కు నిర్మించను న్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లునాయుడు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈర్లె శ్రీరామమూర్తి, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఏఆర్‌జీ శర్మ, జనసేన నాయకులు పీవీఎస్ఎన్ రాజు, జెర్రిపోతుల నానాజీ, వైసీపీ నాయకులు చొక్కాకుల వెంకటరావు, నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి బలిరెడ్డి అభిమానులు, కుటుంబ సభ్యులు దన్నిన వెంకటరావు, బలిరెడ్డి హరీష్‌లతో పాటు సేనాపతి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో యూటీఎఫ్ ప్రతినిధి


గృహ నిర్బంధంలో చిన్నబ్బాయి

చోడవరం, మార్చి 6 : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గురువారం అనకాపల్లి జిల్లా పర్యటన నేపథ్యంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయిని పట్టణంలోని ఆయన స్వగృహంలో బుధవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఎం కాన్వాయిని అడ్డుకుంటారన్న సమాచారంతో అదుపులోకి తీసుకున్నామని పోలీసులు చెప్పడాన్ని ఆయన తప్పుబట్టారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల అనుపోత్సవం


గౌరీపరమేశ్వరుల విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

గొలుగొండ, మార్చి 6 : రావణాపల్లి గ్రామంలో గౌరీపరమేశ్వరుల అనుపు మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. తొలుత పెద్ద సంఖ్యలో మహిళలు తమ ఇళ్లలో తయారు చేసిన వివిధ రకాల పిండివంటలను పళ్లే పర్చి ఊరేగింపుగా బయల్దేరారు. మేళతాళాలు, బాజాభజంత్రీ, బాణసంచా కాల్పుల నడుమ ఆదిదంపతులు కొలువుదీరిన ప్రాంతానికి చేరి తీసుకు వచ్చి సారెగా సమర్పించారు. అనంతరం గ్రామ సమీపంలోని రిజర్వాయర్‌లో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్లు సత్యనారాయణ, కిలపర్తి పెద్దిరాజు, కొల్లు సత్యనారాయణ, చిన తాతీలు, బైరాగి, మడగల పైడియ్య, గంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

గౌరీశ్వరాలయంలో నేత్రపర్వంగా కల్యాణం


మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

చోడవరం, మార్చి 6 : పట్టణంలోని ప్రముఖ స్వయంభూ గౌరీశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు బుధవారం గౌరీపార్వతి కల్యాణంతో ప్రారంభమయ్యాయి. మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఆలయ కమిటీ చైర్మన్ గూనూరు సత్యనారాయణ దంపతులతో అర్చకులు కొడమంచిలి చలపతి మహాన్యాస పూర్వకరుద్రాభిషేకం పూజలతో ఉత్సవాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా రుద్రహోమం ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

పెదపేటలో బయటపడిన లక్ష్మీదేవి విగ్రహం


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రోలుగుంట, ఫిబ్రవరి 6 : ఎంకే పట్నం పంచాయతీ శివారు పెదపేట ధారాలమ్మ గుడి సమీపంలో బుధవారం కొల్లు నూకినాయుడు పొలంలో లక్ష్మీదేవి రాత్రి విగ్రహం బయటపడింది. ఈ విషయం తెలుసుకున్న పరిసర గ్రామా లవారు పెద్ద సంఖ్యలో విచ్చేసి పూజలు నిర్వహించారు. ఈ విగ్రహం దాదాపు వందేళ్ల క్రితం నాటిదని గ్రామస్థులు తెలిపారు. కాగా అమ్మవారి ఆలయాన్ని నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

చీడికాడ, మార్చి 6: మండలంలోని చీడికాడ, తురువోలు, పెదగోగాడ, ఖండివరం, బి.సింగవరం, ఎల్‌బి.పట్నం గ్రామాల్లో శివాలయాల వద్ద బుధవారం శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. చీడికాడ శివాలయం వద్ద పెళ్లిరాటను వేశారు. మాజీ ఎంపీపీ పోతల రమణమ్మ, గ్రామ పెద్దలు పరవాడ మహేష్, బొడ్డు శ్రీరామ్మూర్తి, డోకల దాసు, ఎర్రా మహలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపట్నంలో చండీయాగం రేపు

నాతవరం, మార్చి 6 : సిద్ధిపట్నంలోని దుర్గామలేశ్వర స్వామి అష్టాదశ శక్తిపీఠంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం చండీయాగం నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆ రోజు సాయంత్రం దుర్గామలేశ్వరస్వామి కల్యాణం కన్నుల పడువగా జరగనుందన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా కోరారు.

సరుగుడు తోట దగ్ధంపై పోలీసులకు ఫిర్యాదు

మాకవరపాలెం, మార్చి 6 : జి.కోడూరు రెవెన్యూలో సరుగుడు తోటకు నిప్పుపెట్టినవారిని గుర్తించి, చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల యూత్ ఉపాధ్యక్షుడు రొంగలి శంకర్‌గిరి బుధవారం ఎస్‌ఐ రామకృష్ణారావుకు ఫిర్యాదు చేశారు. శంకర్‌గిరికి చెందిన ఐదెకరాల సరుగుడు తోట మంగళవారం దగ్ధమైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ భూమికి ఆనుకొని ఉన్న ఎరకన్నపాలెం గ్రామానికి చెందిన కొందరు వైసీపీ నాయకులకు, తనకు గత కొంత కాలంగా భూ తగాదాలు ఉన్నాయన్నారు. దీనిపై పోలీసులు గతంలో బైండోవర్ కేసు నమోదు చేశారన్నారు. ఈ నేపథ్యంలో తన సరుగుడు తోట దగ్ధమైందని, బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.

ఉత్సాహంగా ఏఎల్‌పురం హైస్కూల్ ఫేర్‌వెల్

కృష్ణాదేవిపేట, మార్చి 6 : గొలుగొండ మండలం ఏఎల్‌పురం హైస్కూల్‌లో బుధవారం ఫేర్‌వెల్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. హెచ్‌ఎం నాగభూషణం మాట్లాడుతూ టెన్త్ విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ రుత్తల రామలక్ష్మి, ఉపాధ్యాయులు టీవీ రమణ, లోచల రమేష్, దేముడు, లవకుశ, రామ్‌కుమార్, రామరాజు , విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యుత్ సేవల్లో కాలయాపన జరిగితే ఫిర్యాదులు చేయండి

- సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ డాక్టర్ సత్యనారాయణ


విద్యుత్ కోతపై ఫిర్యాదు చేస్తున్న చినవెంకయ్యదొర

బుచ్చెయ్యపేట, మార్చి 6 : నిర్ణీత కాలంలో విద్యుత్ సమస్య పరిష్కారం కాకుంటే తమకు ఫిర్యాదు చేయాలని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం (సీజీఆర్ఎఫ్) చైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ సూచించారు. వడ్డాది ఏపీ ట్రాన్స్‌కో ఏడీఈ కార్యాలయం ఆవరణలో బుధవారం జరిగిన విద్యుత్ వినియోగదారుల సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. నెలరోజులుగా వ్యవసాయ విద్యుత్ మోటార్లకు తొమ్మిది గంటలకు బదులు ఏడుగంటలే విద్యుత్ సరఫరా చేయడం వలన పంటలు దెబ్బతింటున్నాయని శిరిగిరిశెట్టి చినవెంకయ్యదొర, బొబ్బాది రాజు తెలిపారు. రబీ సీజన్ పూర్తికాకుండా వ్యవసాయ విద్యుత్ సరఫరాలో కోత విధించడంపై వారు మండిపడ్డారు. అనధికారికంగా విద్యుత్ కోత విధించడాన్ని వారు ఆక్షేపించారు. బెల్లంక్రషర్‌కు విద్యుత్ చార్జీలు లేకపోయినా తనను బిల్లు కట్టాలంటున్నారని రాజాం గ్రామానికి చెందిన మరిసా అప్పలనాయుడు వాపోయారు. అనంతరం మరికొంతమంది ఫిర్యాదులను అందజేశారు. వీటిపై చైర్‌పర్సన్ మాట్లాడుతూ, నిర్ణీత కాలంలో విద్యుత్ సమస్యలు పరిష్కారించలేనందుకు తమ పరిధిలో గల శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన వంద మంది వినియోగదారులకు సంబంధించి రూ.5.45 లక్షలు పైచిలుకు పరిహార రుసుం విధించామన్నారు. గత ఏడాది 536 ఫిర్యాదులు రాగా, 497 పరిష్కరించినట్టు చెప్పారు. ఈ ఏడాది ఇప్పటి వరకు సదస్సులో 84 ఫిర్యాదులు అందాయన్నారు. విద్యుత్ పరంగా ఎదురయ్యే సమస్యలు సకాలంలో పరిష్కారం కాకుంటే సీజీఆర్ఎఫ్, ఏపీఈపీడీసీఎల్, కార్పొరేట్ కార్యాలయం, పీఅండ్‌టీ కాలనీ, సీతమ్మధార, విశాఖపట్టణంలోని కార్యాలయానికి పోస్టు ద్వారా లేదా నేరుగా ఫిర్యాదులు చేయవచ్చునన్నారు. ఈ సదస్సులో సీజీఆర్ఎఫ్ సభ్యులు ఎం.శ్రీనివాస్, వి.జనార్దనరావు, ఏడీఈ ఎన్.అప్పలనాయుడు, ఏఈఈలు ఎన్.వెంకట్రావు, ఎం.రాంబాబు, జి.సోమరాజు, నందన్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ భూములను కాపాడండి'

నాతవరం, మార్చి 6 : మండలంలోని ప్రభుత్వ భూములు ఆక్రమణలను గురికాకుండా రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని బీజేపీ మండల అధ్యక్షుడు లాలం వెంకటరమణ కోరారు. బుధవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ వల్సంపేటలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోవడానికి వైసీపీ నాయకులు కొట్టుకోవడం ఏమి టని ప్రశ్నించారు. ఒకవైపు ప్రభుత్వం రైతుల భూములను సర్వే చేస్తుంటే, మరోవైపు వైసీపీ నాయకులు రెవెన్యూ అధి కారులపై ఒత్తిడి తెచ్చి పోరంబోకు భూమలను, గెడ్డలను ఆక్రమించుని సాగు చేస్తున్నారని ఆరోపించారు.

ఫిషింగ్ హార్బర్ హుష్ కాకి!

... 5వ పేజీ తరువాయి

వుండడానికి తూతూమంత్రంగా విశ్వ సముద్ర కన్‌స్ట్రక్షన్ కంపెనీకి టెండర్ అప్పగించారన్న వాదన వినిపిస్తున్నది.

త్వరలో పనులు ప్రారంభం

- ప్రసాద్, మత్స్య శాఖ జేడీ

పూడిమడక వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు ప్రారంభం కావాలంటే రహదారి అవసరం. లోవపాలెం రోడ్డులో జగనన్న కాలనీ నుంచి రోడ్డు వేయాలి. ఇందుకోసం ప్రైవేటు వ్యక్తుల నుంచి 58 సెంట్లు సేకరించాలి. ఆయా వ్యక్తులకు నష్టపరిహారం కాకుండా ప్రత్యామ్నాయ భూమి ఇవ్వడానికి చర్చలు జరుగుతున్నాయి. భూమిని సేకరించిన వెంటనే రోడ్డు నిర్మిస్తారు. అనంతరం ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు మొదలవుతాయి.

చౌడువాడలో త్రుటిలో తప్పిన ప్రమాదం



కె.కోటపాడు, మార్చి 6 : చౌడువాడలో బుధవారం ఉదయం విద్యుత్ స్తంభం విరిగి మోటార్ బైక్‌పై పడింది.గ్రామంలో రావిచెట్టు సమీపంలో మోటార్ బైక్‌కు గాలి పెట్టేందుకు మోకానిక్ షాపు వద్ద బండి నిలబడి ఉండగా, ఎ.భీమవరం చెరకు తూనిక కేంద్రం నుంచి గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి లోడుతో రాలీ వెళుతూ పక్కనే ఉన్న విద్యుత్ వైర్లకు తగిలింది. దీంతో ఒక్కసారిగా స్తంభం విరిగి బైక్‌పై పడింది. బైక్‌పై ఉన్న శ్రీనివాసరావు తుళ్లి రోడ్డుపై పడి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.